# చిల్లరకొట్టు సత్యవతి

"కొందరు కొందరి ఉప్పుతిని బతికితే, మరికొందరు ఆ ఉప్పు అమ్ముకొని బతుకుతారు. నిప్పు లేకుండా ఉప్పు లేకుండా ఏ సంసారమూ గడవదు" అంది చిల్లరకొట్టు సత్యవతి నూతి పళ్ళెంలో తనచుట్టూ చీపురు కట్టలు పరుచుకుని ఓ చేత్తో ఈనెలు తీస్తూ.

పది చీపురుకట్టల్లోంచి పదకొండో చీపురుకట్టకు ఈనెలు తీస్తున్న సత్యవతి ఒళ్ళోకి పడేలా అగ్గిపెట్టెని విసిరేశాడు నూతి గట్టుమీద జారగిలి చార్మినార్ తాగుతూ కొండల్రావు. ఆ అగ్గిపెట్టె తగలవలసినచోట తగలగా పులకించిపోతూ-

"ఏంటా పోకిరీ పన్లూ...." అని అరికాల్తో పొడిచింది స్తంభంలా నిలబడి గిలకమీద చెయ్యేసి గిర గిరా తిప్పుతున్న కొండల్రావుని.

"లేస్తావా లెవ్వా" అని బొటనవ్రేల్తో యిటికమీద కూర్చున్న సత్యవతిని గోకాడు.

"నా ఇంటికొచ్చి, నా నూతిపళ్ళెంలో నిలబడి పబ్లిగ్గా

ఏంటీ అల్లరి?" అని సత్యవతి మొహం పైకెత్తి కొండ్రలావు చిలిపి కళ్ళల్లోకి కోపంగా చూసింది.

"నా వడ్డీ నా కిచ్చీ" అని మీసాల్ని పంటితో కొరుకుతూ కళ్ళెగరేశాడు.

"ఏంటా వడ్డీ?" అని తలాంచుకుని చీపురుకట్టను చేత్తో సాపుచేస్తూ "ఇదేంటో తెల్సా" అని కళ్ళతో బెదిరించింది.

"పది చీపురు కట్టల్లోంచి పదకొండో చీపురుకట్ట, పది అగ్గిపెట్టెల్లోంచి పదకొండో అగ్గిపెట్టె – నీ మాయల్నాకు తెలీవా? కొబ్బరుండలూ, చక్కెరకడ్డీలు, పప్పుచెక్కలు, జీళ్ళూ, బిళ్ళలూ అన్నింట్లో కమీషన్! లాభాలు మరిగావు."

"నువ్వు వడ్డీలు మరిగినట్టు."

"మా బాబుకు తెలుస్తే యీప్మీద ఇమానం మోగుతుంది."

సత్యవతి వెనక్కువాలి చెంగు మొహంమీద కప్పుకుని పకపకా నవ్వింది. అలా నవ్వినపుడు ఉప్పొంగిన ఆమె హృదయం పడిలేచే కడలి తరంగంలా నృత్యం చేసింది. కొండ్రలావు ఊపిరి బిగబట్టి–

"యాపారం జేస్తే నీలాటి వయసులో వున్న ఆడపాపే జెయ్యాలి. నానేం జేస్తాను బోయినం" అని రెచ్చగొట్టే నవ్వు నవ్వాడు. నూతిపళ్ళెంలోని సరసాల్ని చూసేందుకు కొబ్బరిచెట్టు ఆత్రంగా తన పచ్చటి మట్టలు విసిరిన నీడల్ని పరిచింది.

కొండ్రలావుకి రింగురింగుల ఉంగరాల జుత్తుంది. కళ్ళకు

వాడే నల్ల కళ్ళద్దాలున్నాయి. మెడమీద టర్కీష్ టవలుంది. గళ్ళలుంగీ వుంది. దానిమీద తెల్ల కళ్ళీలాల్చీ వుంది. ఒంటి నిండా పొగరుంది. పొగరుగా ఎక్కి తిరగడానికో రాలీ సైకి లుంది. అది చాలనప్పుడు సరసవాడ్డానికి సత్యవతి ఉంది.

సత్యవతి చిల్లరకొట్టు కెదురుగ్గా నాయుడుగారి పాక ఉంది పాకచుట్టూ కురుక్షేత్రంలో కౌరవ సేనలా రెండు డజన్లు ఉప్పు బళ్ళున్నాయి. ఊళ్ళో అంతా నా ఉప్పుతినే బతుకు తున్నారని నాయుడు అన్లేదుకాని ఆ పాకల వెనక కొండమీద నాయుడిగారి ఉప్పు అమ్ముకొని బతికేవాళ్ళు చాలామంది ఉన్నారు. ఉప్పు బళ్ళవాళ్ళ సంసారాలన్నీ అప్పూ సప్పూ అరువులూ గిరువులూ అన్నీ సత్యవతి కొట్లోనే. అయిదు పైస లకి ఎంత చింతపండివ్వచ్చో, పదిపైసలకి ఎంత కిరసన్నూన పొయ్యచ్చో. పావలాకి ఎంత మంచినూనె వస్తుందో ఆ లెక్క లన్నీ సత్యవతికి కొట్టినపిండి. పదిపైసఃకో నిమ్మబద్దా, ఇర్వై పైసల కింత పిండీ ఓ ఆవకాయపెచ్చూ, రూపాయికి శేరు నూకలు, ఏడు పైసలకు ఓ కుచ్చీ మిరపకాయలు, ఆరు పైస లకో చిన్న ఉల్లిపాయ, నాలుగు పైసలకో బెల్లంముక్క ఇలా చిల్లరగా అమ్మడానికి చాలా తెలివితేట లుండాలి. ఉప్పుబళ్ళ వాళ్ళు చిల్లరగా ఉప్పుకూడా సత్యవతి దగ్గరే కొంటారు. బియ్యం ధరలు పడిపోకముందు రోజుకో బస్తాన్నర వేసుకుంటే బియ్యం సాయంత్రాని కమ్ముడుపోయి పదీ పరకా కనపడేవి. కొన్నాళ్ళు బీడీలూ, సిగరెట్లు, చుట్టలూ, అగ్గిపెట్లూ పెట్టింది. రోజల్లా ఓ సిగరెట్టెయ్యి బీడీ కట్టెయ్యమంటే యిచ్చి చేతులు

పీక్కుపోయేట్లు అరువులు రాసుకోవడమేగాని - ఆ అరువులు ఖచ్చితంగా వసూలవక ఆ సిగరెట్ల యాపారం ఎత్తేసింది. పిల్లలకి పెనసళ్లూ, రబ్బర్లూ, రూళ్ళ పుస్తకాలు, తెల్ల కాగితాలు పలకలు, బలపాలూ, ఎక్కాల బొక్కలూ పెట్టింది. స్కూలు పిల్లలు బలపం కొన్నా పెనసలు కొన్నా బెల్లంముక్క కొసరు పెట్టాల్సిందే. కొబ్బరికాయల యాపారంలో బాగానే మిగుల్తుందనుకుంటే కుళ్ళిపోయిన కాయలకి డబ్బులు వాపసిమ్మని తగూలొచ్చేవి ఫర్లాంగుదూరంలో మరో కొట్టేదీ లేకపోవడం వల్న - సినిమాహాల్సు వాళ్ళు రెండు తడికల్తెచ్చి సత్యవతి కొట్టుముందు సినిమా పోస్టర్లంటించి నెలకు రెండు ఫ్రీ ప్యాసులిచ్చేవాళ్ళు.

దొంగతనంగా సిగరెట్లు కాల్చుకునే కుర్రాళ్లు సత్యవతి కొట్లో కూర్చుని సిగరెట్ కాల్చుకుంటూ వాస్కు కొట్టేవాళ్ళు, కొత్త సినిమా కబుర్లంటే సత్యవతికి మాయిష్టం. తడికమీద కొత్త సినిమా పోస్టరంటించగానే కబుర్లు ఆరంభమయేవి. ఏడేళ్ళ కూతుర్ని కొట్లో కూచోపెట్టి. రోజువిడిచి రోజూ సత్యవతి మ్యాట్నీలకు చెక్కేస్తూ వుండేది ఉప్పుబస్తాల నాయుడుగారు, ముంకి కాలవమీద నులక మంచం వేసుకుని పద్దులు రాసుకుంటూ ఓరగంట సత్యవతి కూతుర్నీ కొట్టునీ కనిపెడ్తూ వుండేవాడు. "కంపెనీ బాడీ వేసుకుని రవిక తొడుక్కోకుండా నైలాను కోక గట్టి తక్కెడ ముందు కూర్చొని

'సచ్చేవతి' యీ యీదిలోని కుర్రాళ్ళ మతులు చెడగొట్టేలా వుందని ఆ పిల్లకేసి పరామర్శగా చూసి నోట్లు లెక్కపెట్టుకుంటూ నసుక్కునేవాడు నాయుడు. ఒక్కోసారి కొట్టు దులిపేది. ఆ దులపడానికి ముందు కోక ఎగ్గట్టి కుచ్చెళ్ళు మీదకు దోపేది. అలా డబ్బాలు, డొక్కులు, బస్తాలు దులుపుతూంటే-ఓ కాలు కాలంతా మీదివరకూ కనబడి - ఆ రోడ్డుమీద ట్రాఫిక్ జాం అయేది. ఓ వంద గజాల దూరంలో బార్బరు షాపు ముందు బెంచీమీద తల మాసిన మొహాలన్నీ యిటు తిరిగేవి. ఆ బార్బరుషాపు కెదురుగా వున్న టీ కొట్లో టిఫిన్లు తింటున్న శాస్త్రీలన్నీ దుమ్ము దులుపుతున్న సత్యవతి కేసి ఆబగా చూసి యికిలించేవి. టీ కొట్టు పక్కన రిక్షావాళ్ళ గుడిసెలు- ఆ గుడిసెలమధ్య వో కర్రల అడితీ - ఆ అడితిలో కట్టెలు కొట్టే కూలీలు సత్యవతి కేసి చూస్తూ గొడ్డళ్ళను కసిగా వేసి దుంగల్ని చీలగొట్టేవాళ్ళు. గుడిసెల్లోంచి యిటూ అటూ తిరుగుతూ రోడ్డుమీద లంకెలేసుకున్న కుక్కల్ని రాళ్ళెట్టి కొట్టే కుర్రాళ్ళు సత్యవతి కొట్టుముందుకు తరిమి పక పకా నవ్వేవాళ్ళు. ఉప్పుబస్తాల పాక పక్క నారాయుడి డాబా ముందు ఎలక్ట్రిక్ స్తంభానికి గేదెల్ని కట్టేసేవారు. గేదెల్ని కడిగిన రొచ్చునీళ్ళన్నీ సత్యవతి కొట్టుముందుకొచ్చి నిలిచేవి. అలా గేదెల్ని రోడ్డుమీద కడగవద్దని సత్యవతి నారాయుడి పెళ్ళాంతో తగూ వేసుకునేది. గేదెల గలీజు విషయమై ఓసారి నారాయుడి పెళ్ళాం, సత్యవతీ జుట్టూ జుట్టూ పట్టుకుని కొట్టుకుని చీరలు చింపుకున్నారు. నారాయుడి పెళ్ళానికి దెబ్బ

లెక్కువ తగిలాయి. ఆ ఆవేశంలో సత్యవతి బట్ట పట్టుకు లాగే సింది. చీర ఊడ్డంతో సత్యవతి కొట్లోకి పారిపోయింది. రోడ్డు మీది జనం నారాయుడి పెళ్ళానికి చివాట్లేశారు. ఉప్పుబస్తాల నాయుడు రోడ్డుమీద పడిపోయిన సత్యవతి చీరను పుల్లతో చుట్టి కొట్లోకి అందించాడు. ఆ మర్నాడు నాయుడు కొట్లో కొచ్చి బియ్యపు బస్తామీద ఒరిగి కూర్చుని చుట్ట ముట్టించి సాయిలా బాయిలాగా ఇలా అడిగాడు.

"ఇప్పుడు రైలుందనుకో. రైలుకి ఇంజనుండాల, అదే లారీ అనుకో - లారీకి డ్రైవరుండాల. మరి నీ సంగ తీసుకో - డ్రైవరులేని లారీలా గుండిపోనావు. షెడ్ లో ఉంచేసిన కడగని బస్సులాగున్నావ్. అసలేంటి కత? నీకూ నీ పెనిమిటికీ డిఫరన్సు లొచ్చేశాయా? మిలట్రీ జీపులాటి పెళ్ళాన్నొగ్గేసి ఎవడా చవట-ఏం జేస్తున్నాడు? కంచంనిండా కూడుండాల, మంచానికి సరిపడా మొగుడుండాల. మరి నవ్వకు, రోజులేం బావులేవు. నువు రిచ్చాలో ఎల్తుంటే ఎవుడో రవుడీ నాయాల రిచ్చా ఆపి ఇది నా పెల్లం, ఇంటోంచి లేగిసిపోతున్నదని పబ్లీకున తగువెట్టి - నిన్నొట్టికెల్ళి అర్ధరూపాయికి ముండల కంపెనీకి అమ్మేస్తాడు. అందుకని-నువ్వన్నా నీ మొగుడికాడ కెల్లాల - లేదా ఆడన్నా నీ కాడికొచ్చి నీతో వుండిపోవాల. అలాక్కాపోతే ఆడి అరణ్యమెంట్లు ఆడూ, నీ అరణ్యమెంట్లు నువ్వూ యేరేరేగా సేసేసుక్కుంటే అది మరీ మంచిది. ఇప్పుడు నువ్విలా కంపెనీ బాడీలేసుక, నైలాన్ కోకలుగట్టి రివ్వు రివ్వు మని తిరిగేస్తా

వుంటే-యీాది యీాదంతా కంగాలీ అయిపోతా వుంది. మరం దుకే ఆలోసించుకుని నీ పెనివిట్ని పిలిపించు, నీ తరపున నాను మాటాడ్తాను!"

"అసలు మా మనిషికి యీా పచారీకొట్లు సిల్లర మల్లర దుకాణాలంటే అసయ్యం. పెద్ద ఎత్తుల మీాదుంటాడు. కమీాషన్ యాపారం సేస్తానంటాడు. అలాగన్జెప్పి నన్ను తోడుకెళ్ళి అత్తింట్లో దింపి కలకత్తా, బొంబాయి తిరిగి తిరిగి ఆర్నెల్లకో ఏడ్నెల్లకో పాలొచ్చేవాడు. నాకేమో పచారీ యాపారం వచ్చు. ఆ మనిషి బిజినెసూ సెయ్యక నన్ను చిల్లర కొట్టూ పెట్టనీక అత్తారింట్లో బేవార్సుగా వదిలేస్తే - ఆళ్ళ మాటలు పళ్ళేక సొదంతరంగా నా బతుకు నే బతగ్గల్నని పజ్జెందొాందల్తో యీా కొట్టుకు బండి లాక్కొస్తున్నాను. నిలకడలేని మనిసి బాబూ! ఆ మనిసినే వచ్చి నాతో కలిసి యీా కొట్టు నడప మనండి. నాకంతే చాలు" అని సత్యవతి తన బాధ బయట పెట్టింది. సత్యవతి విషయంలో మరింక ముందుకు పోలేక నాయుడు "జేగర్తగుండమని చెప్పి బయటకొచ్చాడు - కాని అప్రయత్నంగా "సెంద్రబింబం లాగుంది మొకం" అనుకుని నాలిక తడుపుకున్నాడు-"ఏ పార్టు కాపార్టు అన్నీ పొజిషన్‌లో ఉన్నాయి గుంటకి-" అని తన ఆలోచనలకి మురిసిపోయి "సీ– పిటిల్లాగయి పోతన్నాది మనసు..." అని విసుక్కున్నాడు! నాయురాలు నాలుగేళ్ళబట్టి మంచం పట్టేసింది - కీళ్ళ వాతం, లెగలేదు. కూడొాండ్డే దిక్కులేక కొండలుగాడికి పెళ్ళిసేసి

ఐదు తులాల బంగారకెట్టి కోడల్ని తెచ్చుగుంటే- అది ముచ్చటగా మూణ్నెల్లకే లారీ డ్రయివరు రాజుగాడితో లెగిసెల్లి పోనాది. కొండలుగాడు కుర్రనాయాల దాన్ని కంట్రోలు సెయ్యలేకపోనాడు. ఆ దెబ్బనించి కాలూ సెయ్యీ లాక్కో-డానికి రెండేళ్ళు పట్టింది...” ఇలా ఆలోచిస్తూ డొక్కు సైకిల్మీద పోతున్న నాయుడికి ఖాళీ రిక్షా అడ్డురాగా - పక్కనించి ఆటోవాడు కుమ్మేయడంతో సైకిలు తిరగబడి నాయుడు క్రిందా, పైన సైకిలుపడి కాలు మడతపడి చట్టపట్టేసి ముగ్గురు రిక్షావాళ్ళ సాయంతో కంపవుండరు డాక్టరు డిస్పెన్సరీకి వెళ్ళి-అట్నుంచటు ఇంటికి చేరి మంచమెక్కాడు.

“ఒరే నాయనా కొండలూ- ఉప్పు బళ్ళవాళ్ళు దొంగలోరే. ఏ పూట కా పూట ఏ గంట కా గంట ఉప్పు కట్టల డబ్బులు వసూల్జేసుకోకపోతే అరువు లెట్టి మాపేస్తారు. జేగర్తరా నాయినా - ఉప్పు లారీ లోడింగు అన్లోడింగు జేగర్తరా బాబూ! మరింక చట్టబాగయి నాన్లేచేదాక బిజినెస్సు నీ చేత లెడతన్నాను. డబ్బు దెగ్గిర జేగర్త కొరే జేగర్త” అని యాపార మర్మాలు చెప్పి కొడుకుని సాగనంపాడు నాయుడు. మొదటివారం కొండల్రావు తండ్రి చెప్పినట్లే చేశాడు. ఆ తర్వాత తండ్రికి చెప్పకుండా కొన్ని చేశాడు.

పాకలో నులక మంచంమీద కూర్చుని కూర్చుని విసుగెత్తి సత్యవతి కొట్టులో కూర్చుని “హస్కు” కొట్టడం మొదలెట్టేడు. క్రమంగా వసూళ్ళన్నీ పాకలో కాకుండా సత్యవతి

కొట్టులో కూర్చొని చేసేవాడు. అక్కడే టిఫినూ టీలు తెప్పించుకుని తాగేవాడు. సత్యవతి మ్యాట్నీలకి చెక్కేసినపుడు నాయుడి కొడుకే సత్యవతి కొట్టులో కూర్చుని బేరాలు జరిపిస్తూ ఉండేవాడు. తరవాత సత్యవతీ నాయుడి కొడుకూ మొదటాటకి సినిమా హాల్దగ్గర మీటవడం, జాయింటు సినిమా లూడ్డం, రిక్షాలో జాయింటుగా తిరగడం ఆరంభించేరు. మిరపకాయ బజ్జీలు, పుణుకులు, వడలు, పిడతకింద పప్పూ, మిచ్చర్లూ తెప్పించుకు ఒకరి చేతులో దొకరు లాక్కుని తిండాలు, నోటి కందించుకోడాలు, పబ్లికున సరసాలు జోరుగా సాగించారు. వాసన్నూనెలూ, సెంట్లూ, సబ్బుళ్ళలూ తరిగిపోతున్నాయి, అరిగిపోతున్నాయి.

సత్యవతి మిఠాయి దుకాణం పెట్టిందని వీధి వీధంతా గుప్పుమంది.

"వయసులో ఉంది, ఆడది. ఉప్పూ పులుసూ తినే పిల్ల ఎన్నాళ్లూరుకుంటుంది?" అన్నారు కొందరు.

"అలా ఒదిలేస్తే ఆయిలింజన్నీ, ఆకలితో వున్న ఆడదానిని ఆపడం శక్యమా" అని మరికొందరన్నారు.

"నాయుడు మూలపడడం చూసి నాయుడి కొడుకుని పట్టింది. వాడ్ని హీటెక్కించి మాపేస్తుంది సత్యవతి" అని కూడా అన్నారు అమ్మలక్కలు. ఈ గుసగుసలన్నీ కొండ్రావు వింటూనే ఉన్నాడు. మగాడికి మరో ఆడదానితో సంబంధం ఉందని పదిమందీ సరదాకి చెప్పుకోడం స్టయిల్లా

బలే దర్జాగానే వుంటుంది. కొండ్రావు సంబరం ఇంతా అంతా కాదు. సత్యవతితో సరసాలు బాహాటంగానే ఓపెనెయిర్లో సాగిస్తున్నాడు. కాని, ఉప్పు బళ్ళవాళ్ళు కొంతమంది గాలి పోగుచేసి మంచంమీదపడి మూలుగుతున్న నాయుడి చెవిలో చల్లగా వూదారు.

నాయుడు "వోరి జెష్ట ముండాకొడకా" అని మంచం మీద ఎగిరెగిరిపడి కొడుకుని తిట్టెన తిట్టు తిట్టకుండా గంటసేపు నానా బూతులూ తిట్టాడు. కొండ్రావు తలొంచుకుని కూర్చున్నాడేగాని పల్లెత్తి మాట్లాడలేదు ఎన్ని తిట్లయినా ఒక సత్యవతి కిస్సుకి సరిరావు.

"నేను మల్లీ లెగిసి పాళ కాడకొచ్చేసరికి యాపారం దివాలా తీయిచ్చేస్తావురా దొంగముండా కొడకా" అని అరిచి, "దానికి డబ్బు మదుపు పెట్టలేదు కదా" అని మెల్లిగా అడిగాడు.

"లేద"న్నాడు తలెత్తకుండా.

"సరసం సరసవే—యాపారం యాపారవే, రెండూ కలప్మాక సచ్చినాడా" అని తండ్రి హితబోధ చేశాడు.

నాయుడికి ఈ కబురు విన్నాక గుండె చెరువైపోయింది.

"మాంచి పొజిసనులో వున్న పిల్ల. ఈడేమో పెళ్లాం లెగిసిపోయి ఆడగాల్లేక ఎదవన్న రెదవలాగ తిరగతా వున్నాడు. సిలు కోకలూ, సేతుల్లేని రవికలూ, కంపెనీ బాడీలు కట్టి సినిమా సోకుల్జేసుకుని మనోడ్ని బుట్టలో ఎట్టేసింది. ఇది అటు

తిరి గిటు తింగి మన కొంపకే ఎసరెట్టేసిందిరా బెమ్మదేవుడా" అని నాయుడు ఒకటే యిదై పోయాడు.

నాయుడి బాధంతా చూసి చూసి నాయురాలు-

"ఆడదానితో ఎల్లడం సబువే"నంది నెమ్మదిగా.

"ఏటా సబువు?" అని నాయుడు చిరాగ్గా అ చాడు.

"అరమాక-పెల్లాం లేసిపోయిందన్న సెడ్డ పేరు దీనితో మాయులేదా? మన మంచికే ఒచ్చిందిది" అని నాయురాలు నాయుడి నోరు మూయించింది టక్కున. మన్మథుని బావుటాలా గాలి కెగిరే పైటచెంగు కొండ్రావుని చేయెత్తి పిలుస్తున్నట్లు, సత్యవతి ఓరచూపులు అతని గుండెల్ని పర పరా కోసేసినట్లు వుండేది. గల్లాపెట్టె ముందు కూర్చున్న సత్యవతితో తులా భారం ఆడలేక, పనున్నా లేకపోయినా ఎదురుగుండా బైఠాయించి చుట్టూ చీమల్లా ఎంతమంది వున్నా ఆమెమీదకు చనువుగా, అగ్గిపెట్టె విసిరో, కాగితం వుండలు జాకెట్లోకి గురి చూసి కొట్టో, వెకిలి నవ్వులు తెగ నవ్వేవాడు. కొండలుడి కోలాహాలం సత్యవతి ఓరకంట కనిపెట్టక పోలేదు. బేరాలు సన్నగిల్లాక వున్నట్లుండి ఇద్దరూ ఓ అయిదు నిముషాలో పది నిముషాలో సైడుకర్టెన్లోకి మాయమై పోయేవారు. రోజుకు రెండు మూడుసార్లు అలాగ పచారీ దుకాణంలోంచి మిఠాయి దుకాణంలోకి అదృశ్యమైపోయి, తిరిగి చెమట్లు కక్కుతూ ప్రత్యక్షమయేవారు.

కొండ్రావు ఏది చేసినా సొంత పబ్లిసిటీ కోసం చేసి

నట్లుండేది. ఎంత ఎక్కువమందికి కొండ్రావుకి సత్యవతితో సంబంధం వుంది అని తెలిస్తే అతనికి అంత గొప్ప. శృంగారానికి చాటు మాటు వుండాల్సిందే మిగతా "యవ్వారాని"కి అక్కర్లేదన్నట్లు వ్యవహరించేవాడు కొండలుడు. పర్వతిరాజు పిచ్చిముండా నదిలో సరస వాడినట్లు, ముందు సత్యవతి నుంచుంటే నడుంమీద చేయివేసి మొహమీదకు సిగరెట్ పొగ వూదడం, పధిరూపాయల నోటుకి చిల్లరిమ్మని గల్లాపెట్టె మీదకు వంగి పదిరూపాయల నోటును జాకెట్‌లోకి గుచ్చడం, కొట్లో లేచి యిటూ అటూ నడుస్తూంటే పిరమీద గిల్లడం, చేత్తో తట్టడం చరువులు చరచడం చేసేవాడు. తను ఎక్కడెక్కడ చేతులు వేసి ఏమేమి చేసినా సత్యవతి లొంగిపోవాల కాని, సత్యవతి చేతుల్ని మాత్రం కొండ్రావు జేబులో పెట్టనిచ్చేవాడు కాదు.

సత్యవతి ఉప్పుబస్తాలవాళ్ళకి రోజుకి రూపాయిచొప్పున కట్టే పద్ధతి మీద నెలకు ముప్పయి రూపాయల చీటీ పెట్టింది. కొండ్రావే ఆ రూపాయి చీటీ డబ్బు ఉప్పుబళ్ళ వాళ్ళనుంచి రోజూ వసూలుచేసి సత్యవతికివ్వాలి. ఇరవైమంది - ఇరవై ముప్పయిలు ఆరొందలు - ఆరొందలకి పాట- పాటమీద ఆరొందలు చీటీ నాలుగొందలకి పోతే రెండొందలలో సావిత్రికి యాభై కమీషనుంటుంది. సత్యవతి సైడు బిజినెస్సు పెట్టింది. రోజు కిరవై రూపాయల చొప్పున సత్యవతి దగ్గర నల్లాళ్ళు

చేతిలో సొమ్ము తిరుగుతూ వుంటుంది. కొండల్రావు తనహీరోయినికి ఆపాటి సహాయం చెయ్యడం సబబని భావించాడు.

ముప్ఫయిరోజులు గడిచాక ఓ ఫస్టున- పెట్రోమాక్సు లైట్లు అద్దెకు తెచ్చి రాత్రి పాకలో చీటీ పాడారు. పాట జాగినంతసేపూ సత్యవతిని కొండల్రావు ఆట పట్టిస్తున్నాడు. మొహంమీద మొహం పెట్టి చెవి దగ్గర గుసగుసలు ఏదో కొంప మునిగిపోయినట్టు ఒకరిమీదొకరు పడిపోతూ నవ్వులు- పాట పూర్తయింది. ఆరొందలుమీద పాట నూటఎనభై దాకా వెళ్ళింది. నూటఎనభై మినహాయించుకుని నాలుగువందల ఇరవై సత్యవతి నుంచి కొండలరావు తీసుకుని పాడిన ఆసామీకి యివ్వగా — అతను మళ్ళీ తెచ్చి తెల్లారాక పట్టుగెళ్తాను మీ దగ్గరే వుంచండి అని కొండల్రావుకిచ్చాడు. కొండల్రావు దాచవే అని నోట్లను తెచ్చి అందరూ చూస్తుండగా సత్యవతి జాకెట్లో కుక్కాడు. సత్యవతి రెండు అరచేతులతో కొండల్రావును తోసింది. అతను వెనక్కు తూలిపడ్డాడు- "నయివే కాస్తయితే పెట్రోమేక్సు లైటుమీద పడే సంగతి" అనగానే- నవ్వే.

"పెట్రోమాక్సు లైటు కంటె నువ్వే బాగా ఎలుగుతా" వని వేళాకోళమాడింది, కొండల్రావు పైమీది తుండుతో సవసానికి వీప్మీద చరుస్తూ సత్యవతిని కొట్టులోకి తరిమాడు.

"ఇయ్యాల నీ జాకెట్టువరివ్వాగుంటే ఆడికి ఆరొందలు లాభం" అని వెనకనుంచి గట్టిగా వాటేసుకున్నాడు.

"శీత్కారీ మాటలాడక ఆగక్కడ బ్రేకుల్లేని లారీలాగ మీద పడిపోతావేటి!"

"మరి నిజ్జూస్తే అంతే-" అని సత్యవతిని లోపలికి తోలుకెళ్ళాక- పాతకాలపు చిలకల మంచం, పాతకాలపు పరుపు పాతదిళ్ళ ప్రోత్సాహంతో పరిచిన పాతదుప్పటి మీద సరదాగా సర్దుకున్నారిద్దరూ - ఆ మంచం చుట్టూ. మంచంకిందా మూటలు, బస్తాలు చిందరవందరగా ఉన్నాయి. కొండల్రావు కమీజు, బనీను తీసి బియ్యపు బస్తామీద పారేశాడు. రాత్రికి ఉప్పులారీకి అన్‌లోడింగుంది. లారీకి డబ్బు కట్టాల. జేబీ నిండా ఆరేడొండల్దాకా నోట్లున్నాయి. రాత్రంతా యిక్కడ మకాంపెట్టి సత్యవతితో కాలక్షేపం చేస్తే, ఏ తెల్లారగట్లో లాకీ వస్తుంది. బిజినెస్సు చూచుకోవచ్చు అనుకొని స్ట్రెయిటుగా శృంగారంలోకి దిగిపోయాడు. కొండల్రావుకి నచ్చితే కూరయినా, పచ్చడయినా, ఆవకాయయినా ఓ చుట్టుకింటే తృప్తిలేదు- మళ్ళీ మళ్ళీ కలుపుతాడు. తిండయినా అంతే— మరేదైనా అంతే! మనిషికి బోయినందగ్గరే కాదు. తరవాదేని దగ్గర మొహమాటం పనికిరాదంటాడు కొండల్రావు

"మరింత మంచోడివి. పవర్‌ఫులు గుంటావు. పెళ్ళావెందుకు లేచిపోయిందో"ని సత్యవతి గమ్మత్తుగా అడిగింది.

"డానూసెత్తక"ని పకమ చిరాకు పడిపోయాడు కొండలుడు.

"అసలు నిన్నే ఆడదయినా వదులుద్దేటి దయ్యంలాసుట్టు

గుంటుంది" అంటూ వుబ్బేసింది. కొండ్రలావు కొండెక్కినంత హుషారై పోయాడు. పరాయివాడి పరుష్మీద కానీ కర్చులేని సరసంతో కొండ్రలావు మగతనం చెలాయిస్తూండగా—కట కటాలు గుంజారెవరో.

"ఎవన్నా బేరవా!" అన్నాడు సరసుడు.

సత్యవతి కొండలుడ్ని ఆగమని చెవి యొగ్గి ఆలకించింది. కటకటాలు మళ్ళీ దడదడ లాడాయి.

"మీ అయ్యకాడు గదా" అని సత్యవతి నవ్వింది. పక్కలో టైంబాంబు పేలినట్లు తుళ్ళిపడ్డాడు.

"మా అయ్యే అయితే సచ్చానే—నా కేద్దారి" అని యిటు అటూ చూశాడు.

"మీ అయ్యే అయితే మంచంకింద దాక్కో" అని "ఫర్లేదు నీ పానానికి నా పానం అడ్డు. లే—లే" అని తొందర పెట్టింది. కొండలుడు యింకా లేచే ప్రయత్నాలు చేయకుండా "ఎవరైతే మనకేటి చల్ మోహానరంగా - నువ్వూరుకో" అని మీదున్న సత్యవతిని కదలనివ్వకుండా అదిమి పట్టాడు.

ఇప్పుడు కటకటాలు మళ్ళీ గిజగిజలాడగా—

"ఒసే సత్తాలూ ఓయి సత్తెవ్వా" అంటూ ఓ పొలికేక ఆదిమానవుడి కేకలా కొట్టంతా దద్దరిల్లేలా వినపడింది

సత్యవతికా కేక చెవుల్లో తుపాకీగుళ్ళు దూరినట్లు. వినీ వినగానే "అమ్మబాబోయ్ నా మొగుడు నా మొగుడు" అని

కొండలుడ్ని తోసేసి మంచంమీంచి లేచి కోక చుట్టుకుంటూ నిలబడింది. ఆ గదికి పెరట్లోకి తలుపుందికాని, లోపలిగడ వూడిపోవడంతో సత్యవతి గొళ్ళెంతీసి తాళంపెట్టి-కొట్టుముందు కటకటాల తలుపునుంచే నడుస్తూండేది. కొండల్రావుకి యేం చెయ్యాల్లో తోచలేదు. మొగుడు మొగుడే!

"తెగవేసే మొద్దునిద్దరా నువ్వూ-సత్తెలూ" అంటూ పెద్ద కేక పెట్టాడు కటకటాల కవతల్నుంచి సత్యవతి బొంబాయి మొగుడు.

"దాక్కో- మంచం కింద" అని బియ్యపు మూటమీద కొండలుడు దర్జాగా వదిలిన కమీజుని, గళ్ళలుంగీనీ, పరుపు కింద దాచేసింది. కొండల్రావు ఏం చేయాలో తెలీక ఆ కంగారులో ఒంటిమీద ఏమీ లేకుండానే సరసం మధ్యలో పిడుగులా నీరసం వచ్చినందుకు భయంతో కంపించిపోతూ- ఇటుచూస్తే మిరపకాయ బుట్టలు, అటుచూస్తే బెల్లపు బుట్టల మధ్యకు చేరి ముడుచుకుని ఏ చీమలు కుడతాయో, ఏ ఎలకలు కరుస్తాయోనని చింతిస్తూ దాక్కున్నాడు. ఈ మంచంకింద ఎమర్జెన్సీ ఎప్పుడవుతుందీ ఎప్పుడు బయటపడతానో "అంతా అసచ్చె వద్దయ్య" అనుకుంటూ మిరపకాయల ఘాటుకి తుమ్ము గట్రా రాకుండా రక్షించు "ఏడుకొండల వాడా" అని ఆ గదిలోని కేలండరు దేముడికి మంచంకిందనించే దండాలు పెట్టుకున్నాడు. చీమల బాధకంటే మరోబాధ మిక్కుటమై సహించరానిదిగా వుంది. అసలే బట్టల్లేవు — మీదకు బొజ్జెంకలు యధేచ్ఛగా

పాకుతున్నాయి. చేతుల్లో కాళ్ళతో బొజ్జెంకల్ని హతమారుస్తున్నాడు.

సత్యవతి కులుకుతూ, నడుస్తూ మొగుడికి తలుపు తీయడాని కెళ్ళడం కొండ్రలావు చూశాడు. సత్యవతి చూసింది—రోడ్డుమీద జనం రద్దీగా లేదు. రిక్షాలు, ఒండి ఒండి లారీలు తిరుగుతున్నాయి. కొండమీద యిళ్ళలో దీపాలు మలిగాయి. రోడ్డుమీద చీకటి వెలుగులు చిల్లుల కంబళిలా పరుచుకుంటున్నాయి. ఎక్కడో దూరంనుంచి రైళ్ళ చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.

"రా" అంటూ ఏకాక్ష రాహ్వానంతో సత్యవతి తలుపు తీసి ఓరగా నిలబడింది. చేతిలో సంచీ, మాసిన బట్టల్తో దుమ్ము కొట్టిపోయిన దుర్వాసుళ్ళా వున్నాడు సత్యవతి మొగుడు.

"బాగున్నావా సత్తేలూ-" అని భుజంమీద చెయ్యేశాడు లోపలికి అడుగుపెడుతూనే.

మొగుడి చేయి మీద పడగానే కడుపులోంచి కెరటాలుగా తన్నుకొచ్చిన దుఃఖంతో సత్యవతి అతని భుజం మీద వాలి బావురుమంది.

"భయపడకే - నేనొచ్చాగా" అంటూ భుజంమీద కండువాతో కళ్ళుతుడిచి దగ్గరకు తీసుకున్నాడు. సత్యవతి ఇంకా గట్టిగా గుమ్మం ముందే నిలబడిన మొగుణ్ణి కదలనివ్వకుండా చుట్టేసి వెక్కి వెక్కి ఏడ్చేసింది.

"ఊరుకో, ఊరుకో" అంటూ అతను వీపుమీద రాస్తూ నుదుటిమీద ముద్దెట్టుకున్నాడు. ముద్దెట్టుకుంటూ—

"లడ్డుండ లాగున్నావే సత్తెలూ." అన్నాడు ఆపుకోలేని తమకంతో.

"లడ్డుండ నలా గూట్లో ఒగ్గేస్తే చీమలట్టిపోవూ" అంది గునుస్తూ.

"చిలక్కొరికిన జాంపండు, చీమలట్టిన లడ్డుండా మా మజాగుంటాయే" అన్నాడు గడ్డంతో మెడకింద సత్యవతికి గిలిగింతలు పెడుతూ.

వీరి సరస సంభాషణలన్నీ వింటూ మంచంకింద కొండ్రావు – "ఈడ్నెప్పుడు మంచం మీందకి తెస్తాది కాబోలా దేవుడా—నన్నెప్పుడు బయటకు తీస్తుందో యీళ్ళ సరసాలింకా బిలింగులో వున్నా"యని విసుక్కున్నాడు.

సంచీలోంచి సత్యవతి మొగుడు దోసెల పొట్లాలు తీశాడు. సత్యవతి కొట్లో నేలమీద మఠంవేసి బస్తామీద కూర్చున్న మొగుడికి తుంపి నోట్లో పెడ్తోంది. తుంపుల్ని వాడు మళ్ళీ నోటితో సత్యవతికి అందిస్తున్నాడు. అది మెడ వయ్యారంగా పెట్టి నోటితో అందుకుంటోంది.

"మసాలా దోసె – బృందావన్నుంచే అయ్యుంటాది" అని మంచం కిందనుంచి కొండ్రావు హోటల్ని గుర్తుపట్టగలిగినందుకు సంతోషిస్తూ ఆ వాసన్ను ముక్కునిండా పీల్చి అమ్మయ్య అనుకున్నాడు.

దోసెల పొట్లం అయ్యాక ఇద్దరూ ఇడ్లీ పొట్లం విప్పి అదే ప్రకారం తింటున్నారు. సత్యవతి పకాటొదిలేస్తే, ఒకళ్ళ మీదొకళ్ళు పడి నవ్వుకుంటున్నారు.

"ఈ పతివ్రత మన్ని మరిసిపోయింది గావల్నురా" అని నెత్తి కొట్టుకున్నాడు కొండ్రలావు—కదిలేందుకు జంకుతూ, దీని మంచం కింద ఏడొందలూ, దీని జాకెట్లో ఆరొందలూ పదమూ డొంద లిప్పుడీ సరసానికి పెట్టుబడి కాబోల్రా దేవుడా అని కొండ్రలావు డబ్బు గురించి కూడా కంగారు పడ్డం ప్రారంభించాడు.

"ఇంత అన్నేయ వుందా?" అంది సత్యవతి.

"అన్నేయవేటి?" అన్నాడు మొగుడు.

"నన్నిలా గూట్లో మిఠా యుండలా ఒగ్గేసి తిరగడం అన్నేయం కాదా!"

"అన్నేయవే - లెంపలోయించు" అంటూ సత్యవతి పచ్చడి చేతుల్తో, తన లెంపల్ని టపా టపా వాయించు కున్నాడు భర్త.

"నువ్విలా రాడం నా కన్నేయమై పోయింది. మంచం కిందకి రారా, ఆ చెంపా యీ చెంపా నేను వాయిస్తాను. కొంప మునిగినట్టు తెల్లారిరాత ఇప్పుడొచ్చావు దొంగముండా కొడకా-నీ సరసం పాడుగాను" అని కొండ్రలావు తిట్టుకున్నాడు అక్కసుతో.

"మరింక నన్నొదిలి ఎత్తే వొట్టు" అని వాడి చేతిని తన నెత్తిమీదెట్టుకుంది సత్యవతి.

"మరి నిన్నొదిలి ఏడకీ ఎల్నే - ఏడకు" అని తల నిమిరాడు.

"నువ్వీ కొట్లోనే వుండిపో - బయటపన్లన్నీ మగోడివి నువ్వే చూసుకో- మనకీ కొట్టు నడిత్తే చాలు. పెద్ద పెద్ద ఆశ లెట్టుకోక వుండిపో" అని అంటూ మొగుడ్ని కౌగలించుకుంది.

తన భార్య తన సప్పైతూ ఆ కాపరం చేసిన మూడ్నెల్ల లోనే అలా పొజిషన్‌లో కౌగిలించుకోలేదని కొండ్రలావుకి గుర్తొచ్చింది. అది మాయపెళ్ళాం- అది చేసిన సంసారం మాయసంసారం- పెళ్ళికి ముందే డ్రయివరు రాజుగాడితో దానికి సంబంధం ఉంది. ఆళ్ళంతా కావాలనే దాన్ని తెచ్చి మా నాన్నను పల్టీ కొట్టించి మాయపెళ్ళి జరిపించి బంగారం గుంజారు. అదెల్లాటిదయినా ఓసారి దగ్గంకొస్తే అరచేతిలో సొర్గం చూపించేది. కానుకోలీదు గాని దానికిది ఎన్నో పెళ్ళో ఎందర్ని ముంచిందో! మాయలేడి!

కొండ్రలావుకి తెలిసొచ్చేసరికి వాళ్ళిద్దరూ మంచం మీద కూర్చున్నారని రెండు జతలకాళ్ళు నేలకు తగలకుండా వ్రేలాడ్డం చూసి గ్రహించాడు. సత్యవతి మోకాల్ని మెల్లిగా పట్టుకుని గోకాడు. కాలు టక్కున మీదకు తీసుకుని రెండో కాలు అవునన్నట్లు జాలిగా వూపింది.

"నీకోసం పెజంటేం తెచ్చానో చూడు" అంటున్నాడు మొగుడు.

"ఏండది నాకోసమేనా?" అంటూంది సత్యవతి.

ఏం తెచ్చాడా అని కొండ్రలావు కూడా సస్పెన్స్‌లో మునిగిపోయాడు.

మంచంమ్మీద సత్యవతి చేతికి లేడీరిస్టువాచీ తొడుగుతున్నాడు మొగుడు.

"ఏంత!" అంది సత్యవతి.

"ఎంతేటి నువు సరదాపడినంత-" అని బుగ్గ గిల్లాడు.

"రెండొందలుంటుందా" అని ముంజేతిని విలాసంగా తిప్పుతూ కవ్వించే కళ్ళతో మొగుడికేసి ఓరగా చూసింది

"అబ్బ బలేగున్నావే- జాంపండూ" అని వాడు దాన్ని మీదకు లాకో-బోయాడు.

ఆగాగమని అరచేత్తో స్టాప్ సిగ్నలిచ్చి మంచం దిగి చేతులెత్తి జబ్బల వయ్యారం చూపిస్తూ ముడి విప్పుతూ నిలబడింది. వాడుకూడా ఆగలేని తమకంతో మంచం దిగి సత్యవతిని వాటేసుకున్నాడు. సైకిల్ని సైకిలు రిక్షా గుద్దినట్లు.

"దీపం తీసెయ్యనా-" అంది సత్యవతి కళ్ళార్పుతూ.

"ఉండ్నియే - నీకంటి తళతళా నీ వొంటి మిలమిలా ఎల్తుర్లో సూడ్నియ్యే" అంటూ మీదపడి వస్త్రాపహరణం మొదలెట్టాడు.

"అబ్బ సిగ్గేస్తది" అంటూ అది చేతులడ్డం పెట్టుకుంటూ గదంతా తిప్పించింది వాడ్ని.

ఆ తరవాత సీన్లను మంచంకిందనుంచి కొండ్రలావు కూడా గోడమీద పడిన నీడల క్రీడల ద్వారా కొంత గ్రహించ కలిగాడు. మంచంమీద వాళ్ళకు మూడు నిమిషాల హాయి మంచంకింద వాడికి మూడు యుగాల నరకంలా ఉంది.

అలా దిగంబర స్వామిలా మంచంకింద "సచ్చవద్దయ" కోసం నిరీక్షిన్తూ పురుగులు ఒంటిమీద పాకుతున్నా, చీమలు కుడుతున్నా, మిరపకాయల గొాత్రు భయపెడుతున్నా అన్ని టినీ సహిస్తూ దాక్కున్న కొండలరావుకి కించిదాత్మ విచారం కలిగింది.

"ఒకడి పెళ్ళాంతో చవగ్గా సరసం లాగించెయ్యడానికి కక్కుర్తి పడ్డంవల్ల గదా యిప్పుడిలాటి చిక్కుల్లో యిరుక్కున్నది." అని తనమీద తను విసుక్కున్నాడు. వాళ్ళిద్దరి సరసం తను ఆవిధంగా గమనించవలసి రావడం కూడా అతనికి శిక్షలా తోచింది.

ఈ మధ్యలో కరెంటాగి పోయింది.

"అమ్మో నాకు భయవే" అంటూ సత్యవతి పెనిమిటి మీదకు అమాంతం పాకింది.

"ఇయ్యేంటి యిఱు గుచ్చుకుంటున్నాయ్" అని సత్యవతి భర్త పెళ్ళాం మొడంతా తడివాడు.

"గొలుసు ల్తీసేమన్నా వా." అంది గోముగా.

"ఉండు లేవకు" అంటూ వాడు పెళ్ళాం మెళ్ళోంచి నగలన్నీ తీసి దిండుకింద పెట్టాడు. ఆ చేత్తో సంచీలోంచి కోవా బిళ్ళతీసి నోటితో దాని నోటికందిచ్చాడు.

నాకూ నోరూరుతున్నాదే ఓటిలా మంచంక్రింద మరో మొగుడికి పారెయ్యకూడదే నంజా, అని కొండలరావు గుని సేడు. కాని అతను సత్యవతి జాణతనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. సంవత్సరమంతా తనతో గడిపి దాని మొగుడితో అది అరగంట జల్సాసేత్తే మనం అన్యాయపడ్డం న్నేయం కాదని కూడా అనుకున్నాడు. ఈ విధంగా తన భర్తతో సుఖించడానికి సత్యవతికి పర్మిషనిచ్చినంతగా సంతోషించాడు మంచం కిందనుంచి కొండలరావు. సత్యవతితో గడిపిన మధుర క్షణాలెన్నో అతని కప్పుడు గుర్తుకొచ్చాయి. సత్యవతితో రిక్షాలో తిరగడమంత సరదా మరోటి లేదు. వక్కపొడిపొట్లం కొంటే నాలిక కొసతో వక్కపలుకు నోటికి అందించేది. ఇక కిళ్ళీ సంగతి సరేసరి. ఒక కిళ్ళీ తను నమిలి తమ్మని నాలికతో అందిస్తూ ముద్దిచ్చేది. అంతేనా, దాని చేతులొక్క నిమిషం వూరుకోనేవి కావు వెనకనుంచి అది వీపు నడుముకుంటే మనసంతా బృందావనమయిపోయేవి. బజార్లో వెళుతున్నా అది మీదపడిపోయేది కాని తిన్నగా నడిచేది కాదు. హాల్లో లైట్లార్పేస్తే ఎవరూ చూడకుండావచ్చి ఒళ్ళో కూర్చునేది. తిరిగింటికొచ్చేటప్పుడు రిక్షాలోనూ అంతే, సచ్చెవతి లీలలు సూత్తే అప్పుడ్డోర్లోనే సూడాలి అని నాలిక తడుపుకున్నాడు కొండలరావు.

"మళ్లీ ఆట బిగినెయినట్టున్నాది. ఇది రెండోసుట్టు గావల్నురా నాయనా, మొగుడ్నొదిలీలా లేదిది" అని సత్యవతిని మెచ్చుగుంటూ లారీలో స్త్రీ బయటపడ్డం ఎలాగన్న డైలమాలో పడ్డాడు కొండలరావు.

ఇంతలో అతనికి నిద్దర పట్టేసింది. సత్యవతి కూడా కాలు రాశరాశవచ్చిన వాడిమీదేసి చేతితో మెడని వాటేసుకుని సుఖనిద్రలోకి జారుకుంది. అంత ఆనందంలోనూ నిద్రపోలేక పోయింది సత్యవతి భర్త మాత్రమే! అతను లేచాడు. మెడ చుట్టూ వేసిన సత్యవతి చేతుల్ని మృదువుగా తప్పించి, మీదకు వేసి అదిమిపట్టిన కాలును నుంచి తన శరీరాన్ని యివతలకులాగి మంచంమీద కూర్చున్నాడు. మీద జాకెట్టు తప్ప ఒంటిమీద మరింకేమీ లేకుండా గుడిమీద బూతుబొమ్మలా పడుకుంది సత్యవతి. దాని జాకెట్టు ఎత్తుగా పొగరుగా ఉంది. రెండు కాళ్ళను కత్తెరవేసి నిద్రపోతున్న సత్యవతి జాకెట్ లోంచి నోట్ల కట్టను అవలీలగా పైకితీశాడు. ఆ చేత్తోనే దిండుకింద మన్మథావస్థలో దాచిన గొలుసుల్ని తీసుకున్నాడు. అప్పుడు మంచం దిగి అర్జంటుగా బట్టలేసుకున్నాడు. ఇవన్నీ సంచిలోకేసుకుని సంచీ పట్టుకు నిల్చున్నాడు. అప్పుడతనికి పరుపుకింద దాచిన మరో మగాడి దుస్తులు కనిపించాయి. ఆ పరుపు కిందనుంచి ఆ కమీజు, లుంగీ లాగగా కమీజు జేబులో మరిన్ని నోట్లకట్టలు కనిపించాయి. ఆ నోట్లుకూడా తీసుకుని ఆ చొక్కాని నేలమీద పారేసి, ముందుషాపులోకెళ్ళి కటకటాల

తలుపులు చప్పుడు చెయ్యకుండా తీసి ఏమనుకున్నాడో మళ్ళీ వెనక్కువచ్చి సత్యవతి చేతినున్న రిస్టువాచీని విప్పుకుని జేబులో వేసుకుని అర్జంటు పని వున్నట్లు వీధిలోకి ఉడాయించాడు.

ఆడది ఒక్కరాత్రిలో యివ్వగలిగినంత సుఖం ఇచ్చింది పెళ్ళానికి పెనిమిటిమీద ఉండే వెర్రి వ్యామోహం అంతా యిదీ చూపించింది. మెళ్లోని బంగారం అంతా వలిచి చేతిలో పెట్టింది. జాకెట్టులో దాచుకున్న డబ్బు తీసుకోనిచ్చింది. మంచంకింద దాచిన మరో మొగుడి తాలూకు జేబులోని డబ్బంతా కూడా యిప్పించింది. ఇంత ఉపకారం చేసిన ఆడది పతివ్రతలలోకెల్ల పతివ్రతకదా! తులసిమొక్కే తులసిమొక్క, సత్యవతే సత్యవతి.

సత్యవతి భర్త సంచీతో సహా రైలు స్టేషనుకి వెళ్ళి దర్జాగా మెయిలెక్కేశాడు మద్రాసికి.

సత్యవతికి ఓ పట్టాన మెలకువ రాలేదు. పనులన్నీ ఆనందంగా పూర్తి చేసుకున్నాక కలిగే సుఖమైన అలసట - ఆపైన వచ్చే నిద్రతో సమానమైంది ప్రపంచంలో మరోటి లేదని, మచ్చు మందు చల్లినట్లు నిద్రపోయింది. మెలకువా నిద్రాకాని ఓ అవస్థలో జరిగినదంతా ఓ కలేనన్న భ్రాంతి కలిగింది. మొగుడు వచ్చినట్లూ,ఇద్దరూ కలిసి కబుర్లాడుతూ ఫలారాలు నోటి కందించుకున్నట్లూ,అతను చేతికి రిస్టువాచీ తొడిగినట్లూ, ఆ తరవాత తామిద్దరూ ఒకటై సంతోష సాగరంలో మునిగి నట్లు కలగన్నాననుకుంది. దారితప్పిన భర్త తిరిగివచ్చి తనని

ఏలుకుంటున్నట్లూ తన ఒంటరితనం, బాధలూ, కడగళ్లూ కష్టాలూ అన్నీ యీడేరినట్లు సంతసించింది.

సరిగ్గా ఆ స్థితిలో-బయట రాత్రి నిశ్శబ్దాన్ని వెక్కిరిస్తూ ఓ లారీవచ్చి ఆగింది. ఆ లారీ చప్పుడుకు కొండల్రావుకి వీపు మీద చరిచినట్లు మెలకువ వచ్చింది. నిద్రలోంచి హఠాత్తుగా లేచాడేమో అతనికి తానెక్కడున్నదీ, ఏ అవస్థలో ఉన్నదీ గుర్తుకురాలేదు. బయట లారీలోంచి కూలీలు దిగి కేకలు పెడుతున్నారు. కొండల్రావు మంచం కిందనుంచి జాగ్రత్తగా ఇవతలకు వచ్చి మంచంమీద సత్యవతి వళ్ళొత్తి అస్తవ్యస్తంగా ఒళ్ళు తెలీకుండా పడుకోవడం చూసి - రాత్రి జరిగినదంతా గుర్తుకు తెచ్చుకుని - గబ గబా బట్టలేసుకుని వీధిలోకి జారుకోవాలనుకున్నాడు.

మంచంకింద దాచిన చొక్కాను నేలమీద చూసేసరికి అతని గుండె గుభేలుమంది. పైకంతీసి దాచిందేమోనని సత్యవతిని తట్టాడు. తట్టాడు కాని దాని పక్కలోని దాని మొగుడు ఏవయ్యాడనే ఆలోచన వచ్చేసరికి అంతలావు సరసుడికీ ముచ్చెమటలు పోసేశాయి.

సత్యవతి కళ్ళు తెరిచేసరికి చేసుకున్న పాపంలా కొండల్రావు మొహం కనిపించింది.

"లారీ వచ్చింది, పైకం తియ్యి" అన్నాడు కొండలుడు. సత్యవతి జాకెట్టు తడుముకుని "ఓరి నాయనో" అని గుండెలు బాదుకుంది. జాకెట్లో అవి ఉన్నాయిగాని అదే లేదు. దిండు

కింద చూసుకుంది. అక్కడ నగల్లేవు. పక్కలో రాత్రి వచ్చిన పెనిమిటి తెల్లావారేసరికి లేడు. లేచి బట్టలు చుట్టుకుంటూ—

"నా కొంప ముంచాడే - ఎదవ సచ్చినోడు" అని గోల పెట్టింది ఏడుస్తూ ముంజేతికేసి చూసుకుంది ఆ చేతిని ఆఖరికి రిస్టువాచీ కూడా లేదు. సత్యవతి నేలమీద చప్పగా కూలబడి రెండు చేతుల్తోనూ నెత్తి బాదుకుని—

"ఎన్ని మాయమాటల్చెప్పావురా - దొంగముండా కొడకా" అని తిట్టిన తిట్టు తిట్టకుండా వరస ఏకరువు పెట్టింది.

కొండల్రావు కొయ్యబారిపోయాడు.

ఒకటీ అరా, పదీ పరకా కాదు. పదమూడొందల రెడీ కాష్ - కాళ్ళొచ్చి నడిచినట్లు నడిచెళ్ళిపోయింది. బయట లారీ ఇంజను ఆగకుండా రొద చేస్తోంది. కూలీలు అరుస్తున్నారు, ఉప్పుబస్తాలు అన్‌లోడ్ చేయించాలి, బస్తాలు దిగ్గానే డ్రయివరుకి డబ్బివ్వాలి.

పదమూడొందలూ యావైందిరా లంజకొడకా అని బాబు జుట్టట్టుకుని తంతాడు. సచ్చెవతి జాకెట్లో దాచింది. జాకెట్లోంచి మాయవయింది. మంచంకింద దాచింది. మంచం కిందనించి మాయవయిందంటే చెప్పొచ్చొకొడతారు విన్నవాళ్ళెవరైనా. రాత్రికి రాత్రి సరసం మధ్యలో మొగుణ్ణంటూ వాడెవడో రావడమేటి, ఇది మహా పతివ్రతలాగ తన్ని మంచం కింద దాచేసి వాడితో మంచంమీద కులకడవేటి... ఈ అరికతంతా వింటే ఎవడు నమ్ముతాడు? ఇంతకీ యీ సచ్చెవతి

మీాది సరదా కొంప ముంచిందిరా దేవుడా! రాత్రిరంతా మంచంకింద చలిలో సిగ్గు, సిగ్గు, ఒంటిమీాద బట్టన్నా లేకుండా చస్తే - ఇదా శిచ్చ - అంటూ కుళ్ళిపోయాడు కొండల్రావు.

పదమూడొందల కరుకులు, పదమూడొండలు కావు. పదమూడొందల కోట్ల సెత్తురు చుక్కలు రాలినట్లు విల పిల్లాడింది సత్యవతి.

"నిన్నెంత నమ్మెనురా - నిన్నెంత సుఖపెట్టేన్రా - కట్టుకున్న పెళ్ళానికి నువ్వింత అన్నేయం చేస్తావురా పాపిష్టి సచ్చినోడా - మెడంతా తడివి బంగారం పిసర్లేకుండా తాళిబొట్టుతో కూడా దొంగిలిస్తావురా" అని గుండెలు బాదుకుంది.

అంతకు ముందువరకూ కేళీమందిరంలావున్న ఆ కొంప యిప్పటికిప్పుడు శవం వెళ్ళినట్టు మహా శూన్యంగా, మహా భీకరంగా మారిపోయింది. కొండలుడు పులికి చలిజ్వరం వచ్చినట్లు వణికిపోతున్నాడు.

"ఇప్పుడేటె సైడం సచ్చివతీ యిప్పుడి కేటి సైడం" అని గొణిగాడు.

"ఆడ్ని లోపలికి రానీడం తప్పయిపోయింది దేవుడోయ్ తప్పైపోయింది" అని కొండలుడ్ని గట్టిగా పట్టుకుని వాడి గుండెలమీాద తల కొట్టుకుంటూ, ఎగసి పడుతున్న రవికలోని ఎత్తుల్తో కొండలరావుని ఎదురొత్తుతూ నాలుగువేళ్ళుచూపించి "నాలుగువేల బంగారం నా వంటిమీాంచి నడిచెళ్ళిపోయింది

నాయినోయ్" అని మళ్ళీ మళ్ళీ అవే సంగతుల్ని గుర్తుచేసు కుంటూ దుఃఖించింది సత్యవతి.

కొండలరావు సత్యవతిని అలా వదిలేసి వీధిలోకి పరి గెట్టాడు. చేతి సంచీతో దుమ్ము కొట్టిన దూర్వాసుల్లాంటి మనిషి కనపడతాడేమోనని సందులు, గొందులు. బస్టాండ్లు, రైల్వే స్టాలుఫారాలూ తెగ గాలించాడు. చెయిజారిపోయిన సొమ్మూ, ఒలికిన పాలూ, జారిపోయిన యవ్వనమూ దొరకవని తెలీక అతనలా ఖంగారుగొడ్డులా వూరంతా చెడతిరిగి పాకలోకొచ్చి కూలబడ్డాడు.

తెల్లగా తెల్లారింది లారీలవాళ్ళు దింపిన బస్తాల్ని మళ్ళీ లారీ కెత్తుకుని యీ చావుకబురు చల్లగా నాయుడికి చేరేసి "మళ్ళొస్తా" మని మళ్ళీ రాకుండా వుడాయించేశారు.

అప్పుడు తిరగేసిన నులకమంచం మీద కూర్చుంటే సేవ లేని నాయుడ్ని కూలేసి "పాకకాడికి" మోసుకొచ్చారు ఉప్పు బస్తాల శ్రామికులు.

నాయుడు "వొం జెస్టెధవా ఏటయింపిరా - సొమ్ములు ఏటయాయ్" అని గుడ్లురిమి జేసి అడిగాడు.

కొండలుడు తల భూమిలోనికి దించుకున్నాడు గాని మరి జవాబివ్వలేదు.

"సావుకారి కొడుకుని... సావుకార్లాగ బతకాల్రా నాయినా—నీ కోకల సర్దాయే కొంపముంచుతాదని చెప్పాను

కానా! సరసం సరసవే- యాపారం యాపారవేనని చెప్పాను కానా లంజకొడకా" అని కాండ్రించి ఉమ్మేశాడు.

కొండడు తలెత్తలేదు.

అప్పుడు నాయుడు ధృతరాష్ట్రుల్లాగ మంచం నెత్తించుకుని చిల్లరకొట్టు సత్యవతి గుమ్మంముందు దిగి—

"ఏటయిందే సచ్చవతీ- ఏటయిందే! ఆడూ మాటాడ్డు- నివ్వూ నోరిప్పవు! ఏటయిందమ్మా- సెప్పు నాకు సెప్పు" అని దాని వీపుమీద చనువుగా నిమిరి నెత్తిమీద దువ్వి, గుండ్రటి భుజాలమీద చేతులేసి లాలించాడు.

సత్యవతి కూడా నాయుడి భుజాలమీద తలెట్టి "గోరం వైపోయింది మావా" అని ముసిలాడ్ని చుట్టేసుకుని బావురుమంది.

"వల్లేదులేయే దానికేంటి పోతే, పోయిందిలేయే ఏడమాకే" అన్నాడు నాయుడు పడుచుపిల్ల ఏడుస్తూ మీదపడి పోతంలోని ఆనందవంతా జుర్రేస్తూ. నాయుడికి నరాలన్నీ జివ్వుమన్నాయి. కాని పదమూడొందల రూకలు గుర్తొచ్చేసరికి తమాయించుకుని—

"నీ కేటయిపోయిందనే- మావుందా" అని నడుం మీద చెయ్యేసి వీపుమీద చరుస్తూ దగ్గరకు తీసుకున్నాడు. ఈసారి సత్యవతి తన తలను నాయుడు ఒళ్లో పెట్టుకుని "ఆడ్నా కొంపముంచాడు దేవుడోయ్—నాలుగు తేల బంగారం

కాళ్ళొచ్చి నడిచేసింది నాయనోయ్" అని తలతో ముసిలాడ్ని కుమ్మేసింది.

"మరేం భయంలేదులేయే- లే-లే. నా మేనగోడలికిచ్చు కున్నాననుకుంటాను. నీకాడ డబ్బెక్కడికి పోతుందే ఎర్రి పిల్లా—" అని నాయుడు సత్యవతిని బుజ్జగించి కొడుకునితనతో రమ్మనమని సంజ్ఞ చేశాడు.

నులకమంచంమీద నాయుడ్ని నలుగురు మోస్తుండగా కొండల్రావు చేతులు గట్టుకుని కూడా ఆవు వెనక దూడలా నడిచాడు. తిట్టడం మానేసి హితోపదేశం చేశాడు తండ్రి.

"ముళ్ళకంచెమీద పైపంచెగిరెల్లి పడ్డాదనుకో— నెమ్మదిగా ఒడుపుగా మన పంచె మనం లాక్కోవాలి. గట్టిగా లాగితే కంపంతా తగులకోని కొర్రట్టిపోద్ది. కాలెల్లి మురిగ్గుంటలో పడిందనుకో—ఆ కాలు కడుక్కోవాల గాని ఇల్లంతా మురికిసేసుకోగూడదు. బేగెల్లి పొంతులిసేత నోటు రాయించుకురా- నెల కొందకి రూపాయి ధర్మవడ్డీకి పదుమూడొందలకి నోటు రాయించి సచ్చేవచ్చేత సంతకం పెట్టించు పైచంగ తుల్నేను సూత్తాగా- ఎర్రైదసలాగ ఏడిస్తే ఏటవుద్ది? సంతకం పెట్టించి నోటు కాయితం తెచ్చిచ్చీ" అని కొండలుడికి ధర్మోపదేశం చేసి నాయుడు "పిల్ల మంచి జబరుమీదుంది. దారిలో కొస్తే అసలుమీద వడ్డీ కొట్టేసినా కొట్టేయొచ్చు- కానీ ఈ మంచంమీంచి లేవలేనే" అని వాపోయాడు.

ఆ మధ్యాహ్నం కొండలరావు సత్యవతి చేత పదమూడు

వందలకి నెలకు రూపాయి ధర్మవడ్డీకి నోటుమీద సంతకం పెట్టించినపుడు "నాయుడుగారు ధర్మరాజు"ని చేతులెత్తి దండంపెట్టింది. పదమూడువందల తగువు యింత తేలిగ్గా పరిష్కారం కావడం నాయుడు చేసిన ఉపకారం అనుకుంది మనసులో సత్యవతి. ఆ రాత్రి నాయుడుమల్లు లాల్చీ తొడుక్కుని మల్లెపూల సెంటు రాసుకుని గడ్డం అదీ నున్నగా చేసుకుని, జరీ కండువా మీదేసుకుని తిరగేసిన మంచంమీద దిళ్ళూ, కొత్త దుప్పటీ పరిపించుకుని పాకలోకి వచ్చి చెక్కల బల్లమీద బైఠాయించి సత్యవతిక్కబురంపించాడు.

సత్యవతి మాసిన చీరతో, రుప్పలా దువ్వని తలతో, చారికలు కట్టి కన్నీళ్ళెండిపోయిన చెంపల్తో బోసిమెడతో పిల్లలాడుకుని పారేసిన తాటాకు బొమ్మలా వచ్చి నిలబంది.

"కూసో కుసో" అని పక్కన కూచోపెట్టుకుని నాయుడు మెడమీద చెయ్యేసి దగ్గరకు లాక్కుని ముద్దెట్టుకున్నాడు.

సత్యవతి దెబ్బతిన్న లేడిపిల్లలా బెదురు కళ్ళతో నాయుడు కేసి చూసింది. నాయుడు పక్క జోబీలోంచి మిఠాయుండ తీసి కొరికి యిందా అని నోటికందించాడు. ముసలివాసన వెగటేసినా నాయుడి జబర్దస్తీకి సత్యవతి హీనంగా లొంగిపోతూ "నోటుమీద సంతకెట్టానుగా" అంది.

"నోటేంటి" అని ఆశ్చర్యపోతూ నాయుడు ముఖం మీద ముఖంపెట్టి జాకెట్టుమీద చెయ్యేశాడు.

"నెలకి వందకి రూపాయి వడ్డీకి నోటు రాయించుకునెళ్లాడుగా" అంది మొహం తిప్పుకుంటూ.

"ఓరి జేష్టెదవా - నీకాడ నోటు రాయించుకునెళ్లాడా ఆడు. అదేంమ్రేదా? వయసులో వున్నావ్ మంచి పొజిషన్‌లో ఉన్నావు. నీకాడ వడ్డీయేటీ - ఉండాడి వస్నేవతా వెళ్ళి, అస్సలుచ్చుకోగాని మళ్ళీ వడ్డీ ఏటి? సీ...సీ...మ్రేద తక్కువ పని సేశాడాడు" అని విసుక్కుంటూ-

"మరేటిదంతా...ఇదంతా వడ్డీ కాదా? అసలు నీకాడ ఎట్టుకో...మరి ముద్దియ్యి. ఇలాగ ముద్దిచ్చేశావంటే వడ్డీ తీరిపోద్ది" అని నాయుడు గల గలా నవ్వాడు!

చేతకాక అసహాయంగా లొంగిపోయిన సత్యవతి తన బ్రతుకుమీద ఎవరో నిప్పుల కుంపటే బోర్లించినట్లు, అసలింకేదో అయినట్లు తన సొగసంతా వడ్డీకింద పోతున్నట్లు బాధపడింది. కట్టుకున్నవాడు తాళిబొట్టుతో సహా తెంపి ఉన్నదంతా వూడ్చుకుపోయాక - మిగిలిన అందాలన్నీ బజారుపాలై వడ్డీకింద జమ అవుతున్నందుకు సత్యవతి ఏడ్చింది.

రోజూ సాయంత్రం వచ్చి సరసాలాడి కొట్లో ఆ రోజు అమ్మకవంతా పదిరూపాయలు తీసుకోమని నోటు జాకెట్లో గుచ్చి మిగిలిందంతా కొండ్రలావు పట్టుకుపోతూ వుంటాడు.

పది చీపురు కట్టల్లోంచి పదకొండో చీపురుకట్ట, పది అగ్గిపెట్టెల్లోంచి పదకొండో అగ్గిపెట్టె, అన్నిటిమీద పైసా పుకా పెంచి మాయచేసేసి, తగూ న్నీ భరిస్తూ సాయంత్రా

సికి యాభయ్యో అరవయ్యో అమ్మితే .... పదిరూపాయలు కూలీకింద మిగిల్చి అంతా నాయుడు కొడుకు పట్టుకుపోతు న్నాడు. ఇది అసలు...

వడ్డీకి నాయుడు పాకలోకి రప్పించుకుని పరమ యాత నలు పెట్టి వదుల్తాడు.

ఇదే వడ్డీకి...నాయుడి కొడుకుతో సినిమా కెళ్ళాలి. రిక్షాలో ఒళ్ళో కూచోవాలి. ఇంటికొచ్చాక వళ్ళు పరిచి పవ లింపు సేవలు చెయ్యాలి, నవ్వాలి, నవ్వించాలి.

సత్యవతికి ఏడుపాగకుండా వచ్చినప్పుడు ... నిలబడి ముఖం చేతుల్తో కప్పుకుని గోడకేసి తిరిగి వెక్కి వెక్కి ఏడుస్తూ వుంటుంది.

ఇంటివాడు అద్దె పెంచమని కబురెట్టాడు. సత్యవతి అద్దె పెంచలేను, బీదదాన్ని బాబూ అని చెప్పుకుంది. ఇంటివాడు మరో కీచకుడు. జాంబవంతుడిలా శరీరమంతా వెంట్రుకలే... ఇంటికి రమ్మని కబురంపి చెయ్యట్టుకుని లాగి నానా అవస్థా పెట్టేశాడు. అరవయ్యేళ్ళు దాటిన వాళ్ళిద్దరూ...ఒకరు అద్దె కోసం, మరొకరు అసలు మీద వడ్డీకింద ... సత్యవతి వయసు పొంగుల్నీ, అంద చందాల్నీ జమేసుకుంటున్నారు.

సత్యవతి నెమ్మదిగా తలుపులు మూసుకుని మంచంమీద కూర్చుని ముఖం చేతుల్తో కప్పుకుని అసలుకి వడ్డీ, పెట్టుబడికి లాభం, కొంపకి అద్దె అన్నీ నేనేగా అని ఏడుస్తూ వుంటుంది.

సత్యవతీ నువ్వు నా చిల్లరకొట్టువే అంటాడు కొండ్రలావు పది రూపాయల నోటును జాకెట్లో గుచ్చుతూ.

"అవునేను చిల్లరకొట్టునే - సత్యవతిని నేను" అని నవ్వేస్తుంది.

ఇదిల్లా జరిగాక -

హఠాత్తుగా నాయుడు కబురెట్టడం మానేశాడు. ఇంటద్దె పెంచమని గొడవ చేసిన పంతులుకూడా పిలిపించుకుని హింస పెట్టడం మానేశాడు.

కొండ్రలావుకి పెళ్ళి సమ్మంధం సెటిలయిందిట వాడూ సాయంత్రం వచ్చి అమ్మకాల్లోంచి అసలు వసూలు చేసుకుని 'వడ్డీ' లెక్కుండా తలొంచుకుని బుద్ధిమంతుల్లా వెళ్ళిపోతు న్నాడు.

లోకంలో యింత మంచితనం ఇంత హఠాత్తుగా ఎలా వచ్చిందని పాఠకులు ఆశ్చర్యపోతున్నారా? చిత్తగించండి!

ఆ రాత్రి సత్యవతి పెనిమిటి తను అడ్డమైన తిరుగుళ్లూ తిరిగి సంపాదించిన పుణ్యం అంతా సత్యవతికి అంటించాడు సత్యవతి వడ్డీకోసం అద్దెకోసం లాభాలకోసం వచ్చిన వాళ్ళం దరికీ ఆ పుణ్యాన్ని తలో కాస్తా పంచి పెట్టేసింది.

ఇప్పుడు వాళ్ళంతా ఏం చేస్తున్నారు సార్!

సెక్సు స్పెషలిస్టుల చుట్టూ తిరుగుతున్నారు సార్! ఎవ రెవరూ - అరవైయేళ్ళు దాటిన నాయుడుగారూ, అద్దె పెంచ మన్న పంతులుగారూ కూడానా?

అవును. నాయుడుగారూ పంతులుగారు మరియూ కొండ్రలావూ సెక్సు స్పెషలిస్టుల చుట్టూ తిరుగుతున్నారు.

మరి సత్యవతో—

సత్యవతి అసల్లోకి జమ వెయ్యడానికి ప్రతి రోజూ ప్రతి నిముషం చీపురు కట్టల్లోంచీ, అగ్గిపెట్టెల్లోంచీ, జీళ్లు బిళ్ళల్లోంచి పైసల్ని లాగి బొట్టు బొట్టుగా నెత్తురు బొట్లను కూడబెట్టినట్లు కూడబెడుతోంది డబ్బు.

డబ్బు పాపిష్టిది సార్!

అవును - డబ్బు పాపిష్టిదే.

వడ్డీ పాపిష్టిదే - సత్యవతి యవ్వనం కూడా పాపానికి పెట్టుబడే! కాని, సత్యవతిని యిప్పుడు 'వడ్డీ' అడగడానికి ఎవరికీ దమ్ముల్లేవు.

సత్యవతి జిందాబాద్! ★

391